క్లుప్తంగా

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎండీ మినా జోద్దీన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉద్దాండపూర్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ–కర్ణాటక సరిహద్దులో ఉద్దాండపూర్ గ్రామం ఉండటంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చొరవతో గ్రామానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్యామప్ప, శ్రీనుగౌడ్, మహిపాల్‌రెడ్డిలు ఉన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని సిద్దులూర్ ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. కాంప్లెక్స్ పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటీల్లో తలపడ్డారు. పోటీల్లో కామరెడ్డిగూడ స్కూల్ మొదటిస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధి నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న జ్ఞానాన్ని వెలికితీయడానికి ఇలాంటి పోటీలు దోహదపడుతాయన్నారు. ప్రిన్సిపల్ చంద్రమౌళి, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు, యాదయ్య, వెంకట్, నవీన్‌కుమార్, రాకేష్ ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాకారిణికి సన్మానం



అన్నూబాయిని సన్మానం చేస్తున్న కలెక్టర్

కొడంగల్ : కొడంగల్‌కు చెందిన కళాకారిణి అన్నూబాయిని సోమవారం జిల్లా కేంద్రంలో సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా అన్నూబాయి మాట్లాడుతూ.. జిల్లాలోని కళాకారులను అధికారులు సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఉద్యమకాలంలో తమవంతు సహకారం అందించి ప్రజలను చైతన్యం చేసినట్లు చెప్పారు.

ఎల్‌సీడీసీపై ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

దౌల్తాబాద్: లెప్రసీ కేస్ డిటెక్షన్ ప్రోగ్రాం(ఎల్‌సీడీసీ)కింద వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సోమవారం నుంచి ఈ నెల 26 వరకు సర్వే నిర్వహిస్తారని సూపర్‌వైజర్ రఫీ తెలిపారు. సర్వేలో భాగంగా ప్రతి గ్రామంలో స్థానిక ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి కుష్ఠు వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరిస్తారన్నారు. ఒంటిపై రాగిరంగులో మచ్చలు ఉన్న వ్యక్తులను గుర్తించి పీహెచ్‌సీ కేంద్రానికి నివేదిక ఇస్తారన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

పూడూరు: సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన సాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో డీసీసీ ఉపాధ్యక్షుడు రాకంచర్ల పెంటయ్య ఆర్థికంగా సాయం చేసి మానవత్వం చాటుకున్నారు. మృతుడు సాయికి ఇద్దరు పిల్లలు ఉండటం సాయి కుటుంబ సభ్యులకు రూ.50 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, శివారెడ్డి, నారాయణ,రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా లీకేజీలు

పట్టించుకోని అధికారులు
- గట్టెపల్లి ఎస్సీకాలనీలో నేటికి సరఫరా కాని మిషన్ భగీరథ నీరు
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆందోళన



మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

ధారూరు: మున్నూరు సోమారం గ్రామంలో వంద కుపైగా పైపులైన్ లీకేజీలు ఉన్నాయని ఎంపీటీసీ రవీందర్ ఆరోపించారు. లీకేజీలను సరిచేయించాల్సిన మిషన్ భగీరథ అధికారులు బేఖాతరు చేస్తున్నారని కుక్కింద, కేరెళ్లి ఎంపీటీసీలు బసప్ప, శ్రీనివాస్‌లు నిలదీశారు. గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీరు వారంలో రెండు, మూడు రోజులు కూడా రావడం లేదని వారు సభదృష్టికి తీసుకువచ్చారు. ధారూరు మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. గట్టెపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో నేటికి మిషన్ భగీరథ పైప్‌లైన్ లేదని చెప్పారు. తాగునీటి సరఫరా బంద్ అయినప్పుడు ప్రత్యామ్నాయం ఏర్పాట్లు లేవని వారు విచారం వ్యక్తం చేశారు.స్పందించిన ఎంపీపీ విజయలక్ష్మి వెంటనే నీటి సమస్యను పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం రోజు తాను మిషన్ భగరథ డీఈ రత్నప్రసాద్, ఏఈ రవిలతో మున్నూరుసోమారంలో పరిశీలిస్తామని ఎంపీడీఓ నర్సింహులు సభ్యులకు వివరించారు. తాగునీటి సరఫరా బంద్ అయితే బి ప్లాన్ ప్రకారం స్థానికంగా ఉన్న బోరు మోటార్ల ద్వారా, లేదంటే సీ ప్లాన్ ప్రకారం జీపీల్లో ఉన్న ట్రాక్టర్ వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటిని ప్రజలకు అందించాలని ప్రత్యేక అధికారి జిల్లా ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. అలాగే, గత ప్రభుత్వ హయాంలో కేరెళ్లి గ్రామానికి వచ్చిన బీసీ బాలికల గురుకుల పాఠశాలను షాబాద్‌లోని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారని , దీనిని వెంటనే వెనక్కి రప్పించాలని ఎంపీటీసీలు శ్రీనివాస్, బసప్ప, రవీందర్‌లు డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలున్నాయని, గత దశాబ్దకాలం నుంచి ప్రభుత్వ జూనియర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ధారూరులో 10వ తరగతి వరకు కొనసాగుతున్నా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఈ సంవత్సరం ఇంటర్ తరగతులు కొనసాగేలా చూడాలని వారు కోరారు. సభ్యులంతా కలిసి ఎంపీపీ, జెడ్పీటీసీలతో ఏకగ్రీంగా తీర్మానించారు. అదే విధంగా జిల్లాలోనే ఎక్కువ విస్తీర్ణంలో నెలకొన్న అడవిలో వేసవిలో తాగునీరు ఉండదని, జంతువులు నీటి కోసం గ్రామాలు, తండాలవైపు వస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అడవిలో 5 సాసర్‌పిట్స్, రెండు రింగులను ఏర్పాటు చేశామని బీట్ ఆఫీసర్ నరేష్ తెలిపారు. ఇదే నెల నుంచి వాటిలో తాగునీటిని నింపి జంతువుల దాహార్తిని తీరుస్తామని అన్నారు. ధారూరు మండలంలో 8,350 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఉండగా 7,150 కనెక్షన్లకు ఆధార్ లింక్ చేసినట్లు సంబంధిత ట్రాన్స్‌కో అధికారి తెలిపారు. చేతికి అందేలా విద్యుత్ తీగలున్నాయని వాటిని సరిచేయాలని ఎంపీపీ ఆదేశించారు. కుష్ఠువ్యాధిని గుర్తించేందుకు మంగళవారం నుంచి ఆశవర్కర్లు సర్వేకోసం గ్రామాల్లోకి వస్తారని, వారికి సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ విజయకుమార్, జెడ్పీటీసీ సుజాత, ఏఓ ఝాన్సీలక్ష్మి, తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

తాండూరు టౌన్ : గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు రావాల్సిన ఏడు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగ, కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. జీఓ నంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్‌కలెక్టర్లను పంచాయతీ సహాయ కార్యదర్శులుగా గుర్తించాలని, జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, మృతి చెందిన వారి కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం రూ. 20 వేలు అందజేయాలన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ముట్టడి కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్, బుగ్గప్ప, నాయకులు జిలాని, అంబరప్ప, నర్సింహులు, వెంకటమ్మ, శాంతమ్మ, శ్యామప్ప, లక్ష్మి, లచ్చప్ప, రాములు, అంజిలప్ప పాల్గొన్నారు.

‘గోశాల’లో రాజకీయాలు తగవు



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

తాండూరు టౌన్ : గోశాల సేవా సమితిలో రాజకీయాలు తగవని ఎంపీటీసీ సభ్యుడు, గోశాల శాశ్వత సభ్యుడు ప్రవీణ్ పటేల్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రజినీకాంత్, బీజేవైఎం నేత కిరణ్ ముదిరాజ్‌లు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన నేతలు గోశాల కమిటీ సభ్యులుగా ఉండటాన్ని తప్పు పడుతున్నామన్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం, నిబంధనలను అనుసరించి 285 మంది శాశ్వత సభ్యుల అనుమతితో నూతన కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా కమిటీని నియామకం చేయడం సబబు కాదన్నారు. వెంటనే నూతన నియామక కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని, అలాగే గోశాల కమిటీ ఎన్నిక కోసం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఉద్యోగాలు ఇవ్వాలని వినతి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అభ్యర్థులు



మనోహర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అభ్యర్థులు

తాండూరు టౌన్ : డీఎస్సీ 2008లో సెలక్ట్ అయిన అభ్యర్థులు ఉద్యోగాలివ్వాలంటూ శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను సోమవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2008లో ఎస్టీటీలుగా సెలక్ట్ అయిన మమ్మల్ని ప్రైవేటు కళాశాలలో డీఈడీ చేశారంటూ ఉద్యోగాలు ఇవ్వకుండా పక్కన పెట్టారని వాపోయారు. తర్వాత కోర్టు ద్వారా ఉత్తర్వులు తెచ్చుకున్నప్పటికీ అప్పటి ప్రభుత్వం మాకు ఉద్యోగాలు ఇవ్వకుండా విత్‌హెల్డ్‌లో పెట్టారన్నారు. ఉద్యోగాలకు సెలక్ట్ అయి నిరుద్యోగులుగా మిగిలిన మాకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. స్పందించిన స్పీకర్ విషయాన్ని తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అభ్యర్థులకు హామీ ఇచ్చారు. అలాగే, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం రుద్రమదేవి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు స్వాతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితో ఎదగాలన్నారు. అబ్బాయి, అమ్మాయి అనే తారతమ్యం లేకుండా ఇద్దరు రాణించేలా సమాన అవకాశాలు కల్పించాలన్నారు. మహిళలు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అందుకు రుద్రమదేవి ఫౌండేషన్ చేపడుతున్న వృత్తి శిక్షణ కార్యక్రమాలు ఎంతో బాగున్నాయన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళల అభ్యున్నతికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం సినీ, యాంకర్ ఝాన్సీ మాట్లాడుతూ.. చదువుతోనే ఏదైన సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరు ఉన్నత స్థాయికి ఎదిగేలా చదివించాలన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అందుకు బాధ్యతాయుత సమాజంలో అందరి పాత్ర ఉండాలన్నారు. కార్యక్రమంలో రుద్రమదేవి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు స్వాతి, ఎస్ఐ అనిత, సినీ నటి లావణ్యరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, మహిళ మోర్చా రాష్ట్ర నాయకురాలు శ్రీదేవి, మా శారద ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ రాజశేఖర్ పలువురు ప్రముఖులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్సై

ఎస్సై సంతోష్‌కుమార్

పరిగి: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సంతోష్ కుమార్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని కొడంగల్ చౌరస్తా, హైదరాబాద్ రూట్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు మద్యం సేవించి నడపడంతోనే జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి నడపటం వల్ల వారి కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశానికి తరలిరండి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకట్



తాండూరు టౌన్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో నేడు హైదరాబాద్‌లో నిర్వహించనున్న సమావేశానికి ముఖ్య కార్యకర్తలు తరలిరావాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న సమావేశానికి బీజేపీ బూత్ అధ్యక్ష, కార్యదర్శులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, మండల ఇన్‌చార్జిలు తప్పకుండా రావాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో 17 పార్లమెంట్ సీట్లలో విజయం సాధించేందుకు జరుగుతున్న ఈ సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానున్నట్లు చెప్పారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

15 నుంచి అడవిల మైసమ్మ జాతర

కొడంగల్ : మండల పరిధిలోని మైసమ్మ తండాలో వెలసిన అడవిల మైసమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు చిట్లపల్లి, ఖాజా అహ్మద్‌పల్లి, పోశమ్మ తండా గ్రామాలకు చెందిన భక్త బృందం సభ్యులు తెలిపారు. 15న ఉదయం అమ్మవారికి సుప్రభాత పూజతో జాతర ప్రారంభం కానుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

క్రమబద్ధీకరణకు ఎదురుచూపులు

- చాలీచాలని వేతనాలతో పంచాయతీ కార్మికుల సతమతం
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



కొడంగల్‌లో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదుట ధర్నా (ఫైల్)

దౌల్తాబాద్: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకం. పల్లెల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో సేవలందిస్తారు. కాని, ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా వారికి వేతనాలు మాత్రం పెరగడం లేదు. చాలీచాలని వేతనాలతో జీవితాల నెట్టుకొస్తున్నారు. ఉద్యోగ భద్రతలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం దయచూపి ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు. నియోజకవర్గంలోని దౌల్తాబాద్, బొంరాస్‌పేట, కొడంగల్ మండలాల్లో దాదాపు 360 మంది మల్టీపర్పస్ వర్కర్లు పనిచేస్తున్నారు. వారిలో కొంతమంది 15ఏళ్లకు పైగా కారోబర్లు, ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్లు, పారిశుద్ధ్య కార్మికులు తదితర పనులు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో పన్నులు, బిల్లుల వసూళ్ల ఆధారంగా నెలకు వారికి రూ.9500ల వేతనం చెల్లిస్తున్నారు. గ్రామంలో ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఏ అధికారి పర్యటనకు వచ్చినా, ఇతర ఏ చిన్న పనికైనా కార్మికుల అవసరం తప్పనిసరి. అదే విధంగా గ్రామాల్లో వీధిదీపాల ఏర్పాటు, నీటిసరఫరా, సంక్షేమ పథకాల అమలు, దరఖాస్తుల స్వీకరణ, గ్రామస్థాయి, మండల స్థాయి నుంచి మండల పరిషత్‌కు కారోబార్లు వారధిగా పనిచేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ప్రతి శాఖలో ప్రభుత్వం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించిందని కాని తమవైపు మాత్రం కనికరం చూపడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

హామీ ఇచ్చారు.. ఆచరణ మరిచారు

మూడు నెలల క్రితం పంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టారు. దీంతో పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. అప్పటి ప్రభుత్వం దశలవారీగా కార్మిక సంఘాల నేతలు, కార్మికులతో చర్చలు జరిపి కొన్ని సమస్యలకు పరిష్కారం చూపింది. కార్మికుడు చనిపోతే దహన సంస్కారాలకు రూ.10వేలు పంచాయతీ నుంచి ఇవ్వాలని, రూ.5లక్షలు బీమా వర్తించేలా చర్యలు తీసుకుంది. మరికొన్ని సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చినా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం స్పందించి పనికి తగిన వేతనం పెంచి తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు వేడుకుంటున్నారు.

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి



పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేదు. వచ్చే వేతనం సరిపోదు. సమానపనికి సమాన వేతనం నెలకు రూ.21 వేలు చెల్లించాలి. కొత్త ప్రభుత్వం స్పందించి అర్హులైన వారిని క్రమబద్ధీకరించి, విగతా వారికి వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి.
–సాయిలు,
పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు

ధరణి సమస్యలపై సత్వర చర్యలు

బంట్వారం: ధరణి సమస్యలపై సత్వర చర్యలకు శ్రీకారం చుట్టామని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, ఆశాజ్యోతి పేర్కొన్నారు. సోమవారం ఆయా రెవెన్యూ కార్యాలయాల్లో ఉనర్న ధరణి పెండింగ్ దరఖాస్తులను వారు పరిశీలించి మాట్లాడారు. గడువు అంటూ ఏమీ లేదన్నారు. పెండింగ్ దరఖాస్తులన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. అర్జీదారులతో మాట్లాడి అప్పటికప్పుడే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ధరణి దరఖాస్తుదారులు రెవెన్యూ అధికారులకు సహకరించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు రాజేందర్, లింగం, ఆర్ఐలు రమేష్ , భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి

కుల్కచర్ల: మండల కేంద్రంలో లోఓల్టేజీ సమస్యతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం అన్నారు. కుల్కచర్ల గ్రామపంచాయతీలో విద్యుత్తు సరఫరా ప్రక్రియలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. లోఓల్టేజీతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసినప్పటికీ విద్యుత్తుశాఖ అధికారులు పట్టించుకోకపోవడం ఆవేదనకరమని వాపోయారు. జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

14న ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్ : ఈనెల 14న (గురువారం) ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు, అప్తాల్మిక్ అధికారి హరినాథ్ తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్షలు చేసి కంటి సమస్యలు ఉన్న వారిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరి రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కంటి సమస్యలు ఉన్న వారు 89198 00421 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రంజాన్ పండుగ ఏర్పాట్లు పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్ : రంజాన్ పవిత్ర మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో పోలీసు, మున్సిపల్, ఆర్టీసీ, తదితర విభాగాల అధికారులు, ముస్లిం మతపెద్దలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. రంజాన్ మాసం సందర్భంగా అన్ని మసీదుల వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పరిసరాలను శుభ్రం చేయించాలన్నారు. విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోటు రావొద్దన్నారు. ప్రార్థనల సమయాల్లో, ఉపవాస దీక్ష విరమణ సమయాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మున్సిపల్ కమిషనర్ విక్రమ సింహా రెడ్డి, పట్టణ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై కాశీనాథ్, డిపో మేనేజర్ సమత, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సేవలు ప్రశంసనీయం



యువతికి కుట్టుమిషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే, ముజీబ్ పటేల్ తదితరులు

తాండూరు టౌన్ : మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వైట్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ పొందిన పలువురు మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీకి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో టైలరింగ్‌లో ఏడు కేంద్రాల ద్వారా శిక్షణ ఇప్పించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పలు రకాల నైపుణ్య కేంద్రాల్లో శిక్షణ ఇచ్చి, యువత స్వయం ఉపాధి పొందేలా చూస్తోందన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు స్వయం సమృద్ధి చెందాలనే ఉద్దేశంతో వారికి శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్‌లు నీరజాబాల్‌రెడ్డి, ప్రభాకర్ గౌడ్, రవిరాజు, ఆర్గనైజేషన్ ప్రతినిధులు ముజీబ్ ఖాన్, ముజీబ్ పటేల్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రవూఫ్, హబీబ్ లాలా పాల్గొన్నారు.